**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.5, Issue-4, April, 2018**
**Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in**

**డా॥ జి. ఝాన్సీవాణి,** ఎం.ఏ. ఎం.ఫిల్. పి.హెచ్.డి.,
రీడర్ & హెడ్, తెలుగుశాఖ
బాపట్ల ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, బాపట్ల

# పోతన భక్తి - సామాజిక దృక్పథం

మనిషి జనన మరణాలను, జీవన కాలాన్ని ఎవరూ నిర్ధారించలేరు. ప్రతి మనిషి తన జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని, మనశ్శాంతిని సంపాదించుకోవాలని ప్రయత్నిస్తుంటాడు. అలాంటి మనిషి కోసం మహర్షులు, జ్ఞానులు చూపించిన మార్గాల్లో ఉత్తమమైన మార్గం భక్తి. మానవులు భక్తి అనగానే బాహ్య పూజలు, తీర్థయాత్రలు, వ్రతాలు అనే భావనతోనే ఎక్కువగా ఉంటారు. శరీరానికిచ్చే విలువ మనిషి ఆత్మకివ్వడు. ఆత్మను పవిత్రంగా ఉంచుకున్నవాడే జ్ఞాని. అలాంటి వారి మనస్సులో దుర్గుణాలు, చెడు అలవాట్లు దూరమవుతాయి. క్షమాగుణం, నిస్వార్థం, త్యాగనిరతి, ధర్మబద్ధత, ఇంద్రియ నిగ్రహం, ద్వేషరహితంగా ఉండడం, సంపదల పట్ల వ్యామోహం లేకపోవడం, సహనంగా ఉండడం, ఈర్ష్యాసూయలు లేకుండా ఉండడం, సుఖదు:ఖాలను సమానంగా స్వీకరించడం, అహంకార రహితంగా ఉండండం మొదలైన సుగుణాలు అలవాడతాయి. సుగుణాలు లేని భక్తి భగవంతునికి ఇష్టంకాక పోగా, కోపానికి కారణమవుతుంది. కాబట్టి సుగుణమే భక్తి అన్న సత్యాన్ని అందరూ గ్రహించాలి.

సాహిత్యానికి, భక్తికి అవినాభావసంబంధమున్నది. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలో కవులు అడుగడుగునా తమ భక్తిని చాటుకునే ప్రయత్నం చేసారు. సాహిత్యం ద్వారా ముక్తిని పొందాలనే తపన కూడా వారి రచనల్లో కనిపిస్తుంది. భక్తిని చాటుకునే ప్రయత్నంలో వారు తరించి, పాఠకులను తరింపజేసారు. వివిధ దేవుళ్లను వారి మహిమలను కీర్తిస్తూ, స్తుతిస్తూ అనేక కవులు అనేక విధాలుగా తాదాత్మ్యం చెందారు.

సమాజానికి హితం చేసేది సాహిత్యమైనప్పుడు కవులు సాహిత్యం ద్వారా కేవలం తమ భక్తిని మాత్రమే చాటుకోకుండా అందులో కూడా సమాజహితాన్ని కోరుకున్నారు. భక్తిని రంగరించి సాహిత్యం ద్వారా లోక కళ్యాణాన్ని చేకూర్చడానికి తహతహలాడారు.

తెలుగు సాహిత్యంలో నన్నయ నుండి ప్రబంధ యుగం వరకు ఉన్న కవులందరూ ఒక ఎత్తైతే పోతన ఒక్కడే ఒక ఎత్తు. భక్త కవుల్లో అగ్రగణ్యుడు పోతన. పోతన రచనల్లో అడుగడుగునా భక్తిరసం తొణికిసలాడుతుంది. గంజేంద్రమోక్షం, వామనావతారం, ప్రహ్లాదచరిత్ర మున్నగు ఘట్టాలు ఆయనను భక్త శిరోమణిగా నిలిపాయి.

ప్రహ్లాద చరిత్రలో ముఖ్యంగా విష్ణువును ప్రస్తుతించే సందర్భంలో నేటి సమాజానికి కూడా ఆమోదయోగ్యమైన కొన్ని గొప్ప సత్యాలను చాటిచెప్పాడు పోతన. భగవంతుడు అంటేనే మంచి, మంచి అంటేనే భగవంతుడు (God is good, Good is God) అనే ఆధ్యాత్మికత అంతర్లీనంగా సాగుతుంది. నిష్కామ భక్తి అంటే ఎలా ఉండాలో పోతన ఈ క్రింది రెండు పద్యాల్లో అద్భుతంగా ఆవిష్కరించాడు.

సీ. కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతుని వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

తా. దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుడు గురుడు
తండ్రి హరిఁ జేరుమనియెడు తండ్రి తండ్రి

సీ కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే
పవన గుంఫిత చర్మ భస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమ ఢమ ధ్వనితోడి ఢక్క గాక
హరి పూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తనుకుడ్య జాల రంధ్రములు గాక

ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే
తరళ సలిలబుద్బుదంబు గాక
విష్ణు భక్తిలేని విబుధుండు విబుధుడే
పాదయుగము తోడి పశువు గాక

★ "కమలాక్షుని అర్చించు కరములు కరములు"

విష్ణువు అనే భగవంతుని పూజించు చేతులే శ్రేష్ఠమైన చేతులని అర్థం. కానీ భగవంతుడంటే మంచి అనే అర్థం తీసుకుంటే మంచి చేసే చేతులే శ్రేష్ఠమైన చేతులని అర్థం, నలుగురికి ఉపయోగపడే పనులు, పదుగురికి హితం చేసే పనులు ఏమైనా చేసినప్పుడే మన చేతులకు సార్థకం ఉంటుందనే పరమార్థం ఇందులో బోధపడుతుంది. అలా ఆపన్నులను ఆదుకోలేని చేతులు చేతులు కావు చెట్టుకొమ్మతో చేసిన తెడ్లు (తరుశాఖ నిర్మితదర్వి గాక)తో సమానం.

★ "శ్రీ నాథుని వర్ణించు జిహ్వ జిహ్వ"
"వైకుంఠుని పొగడని వక్త్రంబు వక్త్రమే"

ప్రపంచంలో మాట్లాడలేని మూగవాళ్ళున్నారు. అలా కాకుండా మాట్లాడగలిగే శక్తి ఉన్నవాళ్ళు తమ నోటి (నాలుక)తో మంచి మాటలు, సంస్కారవంతమైన మాటలు, ఇతరుల్ని నొప్పించని మాటలు, ద్వేషాన్ని రగిలించని మాటలు, నిందాపూర్వకమైన మాటలు, అసభ్యకరమైన మాటలు మాట్లాడరాదు. ఆ భగవంతుడు మెచ్చుకునే మంచి మాటలు మాట్లాడే వారి నోరే శ్రేష్ఠమైన నోరు. తక్కిన వారివి అర్థం పర్థంలేని ఢమ ఢమ అని శబ్దం చేసే ఢక్కతో (ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక) సమానం.

★ సురరక్షకుని( జూచు చూడ్కులు చూడ్కులు

★ కమలేశుని( జూడని కన్నులు కన్నులే

మనచుట్టూ ఉన్న సమాజంలో మంచి విషయాలను మాత్రమే చూడడానికి మన కళ్ళను ఉపయోగించాలి. అశ్లీల దృశ్యాలను చూడడం. ఇతరుల వినాశనాన్ని చూడాలనుకోవడం, స్త్రీలను అసభ్య దృష్టితో చూడడం వంటివి

చేయరాదు. కళ్ళుండి గ్రుడ్డి వాళ్ళలా జీవించకుండా పొరుగువారిలోను, సమాజంలోను ఉన్న మంచిని చూడగలగాలి. అలా చూడలేని కన్నులు కన్నులే కాదు శరీరమనే గోడకున్న రంధ్రాల (త్రనుకుడ్యజాలరంధ్రములు గాక) వంటివి.

★ విష్ణునాకర్ణించు వీనులు వీనులు

మంచి విషయాలు ఎవరు చెప్పినా వినడానికి సిద్ధంగా ఉండాలి. బాల్యం నుండే తల్లి, తండ్రి, గురువులు చెప్పే మంచి విషయాలు వినడం, ఆచరించడం ద్వారా మనిషి ఎదుగుదల సక్రమంగా సాగుతుంది. వినడానికి ఇష్టపడని వారు మూర్ఖులుగా మారతారు. బధిరులుగా కాకుండా వినగలిగే భాగ్యం ఉన్నందుకు ఆ అవకాశాన్ని సార్థకం చేసుకోవాలి. లేకుంటే బధిరులకు వారికి తేడా ఉండదు.

★ మధువైరి( దవిలిన మనము మనము

ఎదుటి వారిలో, సమాజంలో ఉన్న మంచిని చూసి అంగీకరించే ఔదార్యం మనస్సుకు ఉండాలి. చంచల భావాలు, సంకుచిత భావాలను విడనాడి మనస్సును విశాలం చేసుకున్న వాడు మహోన్నతడవుతాడు. మూఢనమ్మకాలను, కుసంస్కారాన్ని వదిలించుకుని సంస్కరించబడిన మనస్సే గొప్ప మనస్సవుతుంది.

★ శేషశాయికి మ్రొక్కు శిరము శిరము

మంచి ఎవరిలో ఉన్నా వారిని కులాలకు, మతాలకు, స్థాయిలకు అతీతంగా శిరము మంచి నమస్కరించాలి (మ్రొక్కాలి). తల ఉన్నందుకు తల పొగరు చూపించడం కాదు, ఎదుటివారిలో ఉన్న ఉత్తమ సంస్కారానికి తలవంచాలి.

★ భగవంతుని వలగొను పదములు పదములు

మంచి పనులు చేయడం కోసం మన పాదాలు ఎప్పుడూ ముందుకు సాగాలి. న్యాయం, ధర్మం, నిజాయితీల వైపు మనం నిలబడాలి. సమాజశ్రేయస్సుకోరి పోరాడే వారి అడుగులో అడుగు కలపాలి.

★ పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

ఏది మంచి ఏది చెడు అని మన బుద్ధితో ఆలోచించి తెలుసుకోవాలి. మంచి, చెడులకు తేడా తెలుసుకోలేని బుద్ధి నిరుపయోగం. ఇంకా చెప్పాలంటే వారికి, బుద్ధిమాంద్యగలవారికి తేడా లేదు.

★ దేవదేవుని చింతించు దినము దినము

ప్రతిరోజు ఏదో ఒక మంచి పని చేయాలి. అలా చేయాని రోజు (దినము) ఆ రోజు మన జీవితములో లేనట్లే అంటే ఆ రోజు మనం జీవించినట్లే పనిగట్టుకుని మంచి పనులు చేయకపోయినా ఇతరులకు అపకారం చేయకపోవడం కూడా మంచి పనితో సమానమైనదే. పాశ్చాత్య వ్యామోహంలో ఫాదర్స్ డే, మదర్స్ డే, ఫ్రెండ్షిప్ డే అంటూ జరుపుకుంటున్నారు. కనీసం ఆరోజైనా వారితో పరిపూర్ణమైన ప్రేమను పంచుకుని సార్ధకం చేసుకుంటారంటే అదీలేదు. కేవలం వేడుకలకు, కానుకలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు.

★ చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు

సారంలేని చదువులు, చిలక చదువులు (బట్టీల చదువులు) కాకుండా చదువుల మూలాన్ని గ్రహించడం, మంచి విషయాలనే చదవడం చేయాలి. అంటే అశ్లీల సాహిత్యానికి, పెడ దోరణి పట్టే సాహిత్యానికి దూరంగా ఉండాలి. ఏ భాషలో ఉన్న మంచి విషయాలనైనా చదివి ఆచరణలో పెట్ట గలిగే పరిణతి ఉండాలి. లేదంటే ఆ చదువు నిరుపయోగం.

★ కుంభినీధవు( జెప్పెడి గురుడు గురుడు

జీవిత సత్యాల్ని రంగరించి విద్యాసారాన్ని అందించే వాడు, మంచి మార్గములో నడుస్తూ, శిష్యులకు మంచి మార్గాన్ని చూపించి ఆదర్శంగా నిలిచే గురువు శ్రేష్ఠమైన గురువు. లక్ష్య సాధనకే కాదు. ఆత్మ సాక్షాత్కారానికి కూడా గురువే ఆలంబన కావాలి. అజ్ఞాన అంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే సద్గురువై “ ఆచార్య దేవోభవ ” అనే పవిత్ర స్థానాన్ని సార్థకం చేసుకోవాలి.

★ తండ్రి హరిఁ జేరుమనియెడి తండ్రి తండ్రి

పుత్రోత్సాహం అనేది పుత్రుడు కలిగినపుడు కాదు అతడు ప్రయోజకుడైనపుడు కలగడం ధర్మం. అందుకోసం తమ బిడ్డలు మంచి దారిలో నడిచే విధంగా బాల్యం నుండే వారి వెన్నంటి ఉంటూ వారిని ఉత్తములుగా తీర్చి దిద్దే తండ్రి నిజమైన తండ్రి. "పితృదేవో భవ" అసత్యం కాదని నిరూపించే తండ్రే గొప్ప తండ్రి

★ కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే

" పరోపకారం ఇదం శరీరం" అని ఆర్యోక్తి. అందం కోసం, ఆడంబరాల కోసం శరీరాన్ని పెంచి పోషించి వివిధాలంకరణాలతో తీర్చి దిద్దడమే కాదు పరోపకారానికి కూడా శరీరం ఉపయోగపడాలి. అలా కాని పక్షంలో ఆ శరీరం కేవలం గాలితో నింపబడిన తోలు తిత్తే (పవన గుంఫిత చర్మ భస్త్రీ గాక) అవుతుంది.

★ చక్రి చింతలేని జన్మంబు జన్మమే

అన్ని జన్మలకన్నా మానవ జన్మ ఉత్తమమైనది. అటువంటి మానవ జన్మ ఎత్తినవారు మంచి పనులు చేస్తూ తమ జీవితాన్ని సార్ధకం చేసుకోవాలి. అలా చేయని పక్షంలో ఆ జన్మవృధా, అటువంటి వారి జన్మలు కదులుతున్న నీటి బుడగల (తరళ సలిల బుద్బుదంబుగాక) వంటివే వారి ఉనికి వారి మరణంతో పాటే మాయమైపోతుంది.

★ విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే

ఎన్నో శాస్త్రాలు చదివి సంపాదించిన విజ్ఞానాన్ని సన్మార్గంలో అమలుచేసేవాడే నిజమైన పండితుడు. తన విజ్ఞానాన్ని సమాజ ఉన్నతికే తప్ప సమాజ వినాశనానికి ప్రయోగించకూడదు. అలా చేసేవాడు రెండు కాళ్ళున్న జంతువుతో (పాదయుగముతోడి పశువుగాక) సమానం.

పై లక్షణాలన్ని నంతరించుకున్న మానవుడికి రాగద్వేషాలు, అహంకారాలు అంతరిస్తాయి. తుచ్ఛమైన ప్రాపంచిక ఆకర్షణలు తొలగి అందరూ ఆత్మీయులే అనే భావన కలుగుతుంది. మనిషి మాధవుడిగా మారడమంటే ఇదే.

పోతనకు శ్రీమహావిష్ణువుపై ఉన్న అచంచలమైన, అపారమైన, అనితరసాధ్యమైన భక్తిని వక్రీకరించడం కాదు ఈ వ్యాస ఉద్దేశం. నేటి కళాశాల విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉన్న పోతన ప్రహ్లాద చరిత్రలోని ఈ గొప్ప సత్యాలను ఈ రీతిలో బోధించినప్పుడు పోతన భక్తి భావానికి అనుసంధానం కాలేని విద్యార్థులుకూడా సులభంగా ఆమోదించి ఆచరించే అవకాశాలు పుష్కలం. విష్ణువును పూజించే చేతులే శ్రేష్ఠమైన చేతులు అని చెప్పడంకంటే మంచి చేసే చేతులు శ్రేష్ఠమైన చేతులు అన్న భావన సర్వమతాల వారికి అంగీకార యోగ్యంగా ఉంటుందనడంలో సందేహంలేదు.

భక్తి ఆడంబరం కోసం కాదు ఆచరణాత్మకంగా ఎలా ఉండవచ్చో అనే విషయాన్ని నేటి సమాజానికి తగినట్లు చెప్పే ప్రయత్నం మాత్రమే ఇది.